
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 29 సెప్టెంబరు 2024



జ్ఞాపకాలను మిగిల్చి..



చిన్నారి (ఫైల్)


నీళ్ల బకెట్‌లో పడి చిన్నారి మృతి

తప్పటడుగులతో ఇల్లంతా తిరుగుతూ...
చిన్న చిన్న శబ్దాలతో అందరినీ పలుకరిస్తూ..
అవ్వాతాతలతో ఒడిలో ఆడుకుంటూ...
బయటికెళ్లే నాన్న కాళ్లను చిట్టి చేతులతో బంధిస్తూ
సందడి చేసే చిన్నారిని నీళ్ల బకెట్ మింగేసింది.
అనుక్షణం కంటికి రెప్పలా చూసుకునే
అమ్మానాన్నలు, అవ్వాతాతలను
విషాదంలోకి నెట్టేసింది.
ఉదయం లేవగానే తన గుండెలపై
ఆడుకున్న పసిపాప పొలానికి వెళ్లి వచ్చేలోపు
విగతజీవిగా మారడంతో ఆ తండ్రి హృదయం
శోక సంద్రమైంది.
అప్పుడే అలా పని మీద బయటికెళ్లిన
అవ్వాతాతల గుండెలను
మనవరాలి మృతి వార్త పిండేసింది.
ఇంటిముందు ఆడుకుంటున్న పాప
ఎక్కడికెళ్తుందిలే అనుకుందో ఏమో ఆ తల్లి
వంట పనిలో నిమగ్నమైంది.
తిరిగి వచ్చి చూసేలోపు
కన్నవారికి కన్నీటి జ్ఞాపకాలను మిగుల్చుతూ
మరలిరాని లోకాలకు వెళ్లిపోయింది.

గుడిబండ, సెప్టెంబరు 28: నీటిబకెట్‌లో పడి 14 నెలల చిన్నారి మృతి చెందిన సంఘటన గుడిబండ మండలంలోని ఎస్ ఎస్ గుండ్ల గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. గ్రామానికి చెందిన సింధూ, జయరాం దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె ఉంది. ఉదయం పాపతో కాసేపు గడిపిన జయరాం తర్వాత పొలం పనికి వెళ్లాడు. పాప అవ్వాతాతలు సైతం పనిమీద బయటకు వెళ్లారు. దీంతో చిన్నారి, ఆమె తల్లి ఇంట్లో ఉండిపోయారు. పాప బయట ఆడుకుంటుండగా తల్లి సింధూ వంటపనిలో నిమగ్న మైంది. పాప ఆడుకుంటూ వెళ్లి సమీపంలోని నీళ్ల బకెట్ లో పడింది. ఆ సమయంలో ఎవరూ గమనించపోవడంతో బకెట్‌లో నుంచి బయట పడే శక్తి లేక చిన్నారి అలాగే ఉండిపోయింది. పాప శబ్దాలు ఏవీ వినిపించకపోవడంతో కాసేపటి తర్వాత వంటింటిలో నుంచి సింధూ బయటకు వచ్చి చూసింది. చిన్నారి కనిపించకపోవడంతో చుట్టూ వెదికింది. చివరికి బకెట్‌లో పాప పడి ఉండటం గమనించింది. చిన్నారి మెదలకపోవడంతో బోరుమంటూ మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.



మృతిచెందిన చిన్నారి



చిన్నారి మృతికి కారణమైన బకెట్

కూటమిలో 'కమిషనర్' చిచ్చు

- ధర్మవరం మున్సిపాలిటీలో ముదిరిన వివాదం
- కమిషనర్ మల్లికార్జునకు వ్యతిరేకంగా టీడీపీ శ్రేణుల ఆందోళన
- కమిషనర్‌కు అండగా నిలిచిన మంత్రి సత్యకుమార్
- మంత్రి తీరుపై మండిపడ్డ టీడీపీ శ్రేణులు.. కాన్వాయ్ అడ్డగింత
- వైసీపీ హయాంలో వేధించిన అధికారి తమకు వద్దని నినాదాలు

వైసీపీ పాలనలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఎంతో నష్టపోయాం. అందుకే ప్రజలను బతిమాలి కూటమికి ఓట్లు వేయించాం. ఇప్పుడు మన ప్రభుత్వం వచ్చింది అనుకుంటే మళ్లీ అతడినే కమిషనర్‌గా తీసుకొస్తే ఇంకేదేవుడికి మొక్కాల? ఇందుకేనా మేము అంతగా కష్టపడి గెలిపించింది అంటూ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి సత్యకుమార్ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ఆందోళన నినాదాలు, రోడ్డుపై బైఠాయింపు వరకు వెళ్లింది. ఈక్రమంలోనే వైసీపీకి తొత్తుగా వ్యవహరించిన కమిషనర్ వెంటనే వెళ్లిపోవాలని నినదించారు. ఈ పరిణామాలు కూటమిలో చిచ్చుకు కారణమవుతున్నాయి.



మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

ఇందుకేనా మిమ్మల్ని గెలిపించింది?

ధర్మవరం, సెప్టెంబరు 28: ధర్మవరం మున్సిపాలిటీ కమిషనర్‌గా మల్లికార్జునను నియమించడం ఎన్డీఏ కూటమిలో చిచ్చును రగిల్చింది. వైసీపీ హయాంలో తమను వేధించిన అధికారిని తిరిగి కమిషనర్‌గా తీసుకురావడం ఏమిటని టీడీపీ శ్రేణులు కొన్నాళ్లుగా అసంతృప్తితో రగిలిపోతూ.. ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. కమిషనర్ మల్లికార్జునకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ అండగా నిలవడంతో టీడీపీ శ్రేణులు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ధర్మవరం కమిషనర్‌గా మల్లికార్జున కొనసాగుతారని, అతనికి మంచి అధికారిగా పేరు ఉన్నందుకే ధర్మవరం అభివృద్ధి కోసం ఏరి కోరి తీసుకువచ్చానని మంత్రి ప్రకటించారు. ఓటు వేసి గెలిపించిన ప్రజల శ్రేయస్సే తనకు ముఖ్యమని అన్నారు. ఈ నేపథ్యంలో ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో మంత్రి శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి కమిషనర్ మల్లికార్జున హాజరయ్యారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు భారీఎత్తున అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించాయి. ఈ ధర్నా దాదాపు రెండు గంటల పాటు జరిగింది. వాహనాల రాకపోకలు స్తంభించాయి. మున్సిపల్ కమిషనర్ గో బ్యాక్ అని టీడీపీ శ్రేణులు నినాదాలు చేశాయి. వైసీపీకి తొత్తుగా వ్యవహరించిన కమిషనర్ వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ వారికి వైసీపీ కండువాలు వేయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కమిషనర్ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి అని నినాదాలు చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ప్రభాకర్, పలువురు ఎస్ఐలు అక్కడికి చేరుకుని టీడీపీ శ్రేణులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కానీ వినుకోలేదు. వైసీపీ హయాంలో మున్సిపల్ కమిషనర్ కారణంగా ఎలాంటి బాధలను అనుభవించామో తమకే తెలుసునని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు ఎల్ నరేంద్రచౌదరి వెళ్లి మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో సంప్రదింపులు జరిపారు. మంత్రి టీడీపీ శ్రేణుల వద్దకు వచ్చి మాట్లాడారు. కమిషనర్ నియామకం తన చేతిలో లేదని, ఏదైనా ఉంటే పెద్దాయనతో (చంద్రబాబునాయుడు) మాట్లాడుకోవాలని సూచించి, కారు ఎక్కారు. దీంతో టీడీపీ శ్రేణులు మరింత ఆగ్రహానికి లోనయ్యాయి. కష్టపడి గెలిపిస్తే తమకు ఇచ్చే బహుమానం ఇదేనా అని మంత్రిని నిలదీస్తూ.. ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని మంత్రి కాన్వాయ్‌ని ముందుకు పంపించారు. చివరికి మంత్రి తన కార్యక్రమాలను రద్దు చేసుకుని అనంతపురం వెళ్లిపోయారు. మంత్రి కాన్వాయ్ వెళ్లడానికి మునుపు కమిషనర్ మల్లికార్జునను డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య ఎన్డీఏ కార్యాలయం వెనుక ద్వారం నుంచి ప్రత్యేక వాహనంలో తరలించారు. కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఉంటారని భావించిన టీడీపీ శ్రేణులు అక్కడికి వెళ్లారు. అక్కడ లేకపోవడంతో వెనుదిరిగారు.

మమ్మల్ని హింసలు పెట్టారు..

వైసీపీ కండువా కప్పుకుంటేనే పనులు చేసి పెడతానని అప్పట్లో కమిషనర్ మల్లికార్జున తమను హింసకు గురిచేశారని టీడీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలలో ఏకపక్షంగా వ్యవహరించారని, నామినేషన్లను కూడా వేయనీకుండా అడ్డుకున్నారని అన్నారు. మున్సిపల్ రిజర్వు స్థలాలతో పాటు టీడీపీ హయాంలో పేదలకు ఇచ్చిన ఏడు వేల ఇంటి పట్టాలను రద్దు చేసి.. వైసీపీ వారికి పంచిపెట్టిన అవినీతి పరుడు కమిషనర్ అని మండిపడ్డారు. అటువంటి వ్యక్తికి మంత్రి వత్తాసు పలకడం విచారకరమని అన్నారు. 'రాత్రింబవళ్లు కష్టపడి, ఓటర్ల కాళ్లు పట్టుకుని ఓటు వేయించి గెలిపిస్తే నీవు ఇచ్చే బహుమానం ఇదేనా..?' అని మంత్రి తీరుపై మండిపడ్డారు. టీడీపీని ఇబ్బందులు పెడితే నాశనం కాకతప్పదని శాపనార్థాలు పెట్టారు.



ఎన్డీఏ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించిన టీడీపీ శ్రేణులు



ధర్నా విరమించాలని టీడీపీ శ్రేణులకు చెబుతున్న పోలీసులు



ఎన్డీఏ కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్లడానికి ప్రయత్నిస్తున్న టీడీపీ శ్రేణులు

ఏంటో ఈ గొడవ





పురం ఆసుపత్రిలో సైలెంట్ వార్

సీనియర్ వైద్యులు వర్సెస్ సూపరింటెండెంట్

ఉన్నతాధికారులకు లేఖ రాసిన డాక్టర్లు


హిందూపురం, సెప్టెంబరు 28: పట్టణంలోని పెద్దాస్పత్రిలో కొంతకాలంగా సూపరింటెండెంట్, వైద్యుల మధ్య సైలెంట్ వార్ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రోహిల్ అనే వైద్యుడిని సూపరింటెండెంట్‌గా నియమించారు. అతడి నియామకం అక్కడ పనిచేస్తున్న సీనియర్ వైద్యులకు నచ్చలేదు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సైలెంట్‌వార్ ప్రారంభమై, కొనసాగుతోంది. ఇది చిలికి చిలికి గాలివానగా మారి ఆరోగ్యశాఖ ఉప కమిషనర్‌కు సూపరింటెండెంట్‌పై లేఖ రాసేవరకు వెళ్లింది. తొమ్మిది మంది వైద్యులు సూపరింటెండెంట్ రోహిల్‌పై తిరుగుబాటు చేస్తూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

జూనియర్ కావడమే సమస్య..!

హిందూపురం ప్రభుత్వ జిల్లా స్థాయి ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌తో కలిసి 45మంది వైద్యులున్నారు. ఇందులో పది మందికిపైగా సీనియర్ వైద్యులున్నారు. వీరందరిని కాదని జూనియర్ అయిన రోహిల్‌ను సూపరింటెండెంట్ చేయడం వారికి మింగుడు పడలేదు. ఈక్రమంలోనే వైద్యుల పట్ల సూపరింటెండెంట్ వేధింపులు అధికమయ్యాయని, చాలా రోజుల నుంచి భరిస్తూ వస్తున్నామని, సీనియర్ వైద్యులపట్ల ఆయన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఇటీవల రాష్ట్రస్థాయి ఆరోగ్యశాఖ అధికారులు వచ్చినప్పుడు ఫిర్యాదు కూడా చేశారు. దీంతోపాటు విచారణకు వచ్చిన అధికారులను సూపరింటెండెంట్ తప్పుదోవ పట్టించినట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అతనిపై లేఖ రాశారు.

ఈ లేఖ సారాంశం ఏంటంటే...

ప్రస్తుతం ఉన్న సూపరింటెండెంట్‌ను మార్చాలని డైరెక్టరేట్ ఆఫ్ సెకెండరీ హెల్త్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఆయన వైద్యుల్లో జూనియర్ అసిస్టెంట్ సర్జన్. అతడికి ఎలాంటి పరిపాలన అనుభవం, అవగాహన లేదు. అతను క్లినికల్ వైద్యుడు కాదని, వైద్యులతో సత్సంబంధాలు కొనసాగించలేడని, వైద్యుల పట్ల దురుసుగా వ్యవహరి స్తారని లేఖలో పేర్కొన్నారు. దీంతో సీనియర్ వైద్యులు, సూపరింటెండెంట్ మధ్య కోల్డ్‌వార్ జరుగుతున్నట్లు బహిర్గతమైంది.



ఉన్నతాధికారులకు పంపిన లేఖ ఇదే..

సఖ్యత లేకపోవడమే కారణం

రోహిల్‌ను రెండేళ్ల క్రితం కూడా సూపరింటెండెంట్‌గా నియమించారు. అప్పట్లో కూడా ఇతడిపై ఇతర వైద్యులు గుర్రుగా ఉన్నారు. అప్పట్లో కూడా ఇతన్ని సూపరింటెండెంట్‌గా తప్పించాలని, వేరే వైద్యుడికి చార్జ్ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో అతన్ని తప్పించి వేరేవారికి బాధ్యతలు అప్పగించారు. కానీ మరోసారి అతన్ని నియమించడం కొంతమంది వైద్యులు జీర్ణించుకోలేక మరోసారి అతనిపై తిరుగుబాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. 9మంది వైద్యులు లేఖలో సంతకాలు చేసి పంపించారు. ఆయన వేధింపులు భరించలేకే సంతకాలు సేకరించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫ్ హెల్త్ కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ చేతన్, ఉమ్మడి జిల్లా డీసీహెచ్ పాల్ రవికుమార్, సత్యసాయి జిల్లా డీసీహెచ్ తిప్పేంద్రనాయక్‌కు లేఖ ప్రతులను పంపినట్లు తెలిపారు.

ఆదాయానికి గండి కొట్టారనా ?

ఇదిలా ఉంటే ఆసుపత్రిలో ఒకరిద్దరు వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు మాదిరి డబ్బులు వసూలు చేస్తున్నారని, వారి పట్ల సూపరింటెండెంట్ కఠినంగా వ్యవహరించడంతో ఆయన్ను వ్యతిరేకిస్తున్నట్లు మరికొంతమంది వైద్యులు చర్చించుకుంటున్నారు. సాయంత్రం కూడా ఓపీ పెట్టాడని, ఇది కొంతమంది వైద్యులకు మింగుడుపడటంలేదని ఇదికూడా అతన్ని వ్యతిరేకించడానికి ఒక కారణమన్నారు. ఏదిఏమైనా ప్రభుత్వ జిల్లా స్థాయి ఆసుపత్రిలో వైద్యుల మధ్య ఇలా వార్ జరుగుతుంటే రోగులకు ఏం వైద్యం అందిస్తారని మరికొంతమంది వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సూపరింటెండెంట్ రోహిల్‌ను వివరణ కోరగా ఆసుపత్రిలో నాతోపాటు 45మంది వైద్యులున్నారని ఓ ఐదు మంది మాత్రమే అలా వ్యవహరిస్తున్నారన్నారు. మిగిలిన వైద్యులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తాను వైద్యులతో సఖ్యతగా ఉన్నానని మిగిలినవారెవరికి ఇబ్బంది లేదన్నారు.

ఎక్కడికి పోతున్నట్లు..?

రేషన్ బియ్యం బస్తాల్లో తక్కువ తూకాలు

50 కిలోల బస్తాలో 41 కిలోలే ...ప్రతి నెలా ఇదే తంతు..డీలర్ల ఆవేదన

ధర్మవరంరూరల్, సెప్టెంబరు28: రేషన్ డీలర్లకు అందించే బియ్యంలో దోపిడీ జరుగుతోంది. బస్తాలో 10 కేజీల తగ్గింపుతో సరఫరా చేస్తున్నారని డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. పేరుకు 50 కిలోల బస్తా అందులో వచ్చేది మాత్రం 41కిలోలే. ఇలా తక్కువ వస్తే లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేయాలంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. అక్టోబరు నెలకు సంబంధించి ప్రభుత్వం స్టాకు పాయింట్ నుంచి గ్రామాల్లోని రేషన్‌షాపులకు బియ్యం సరఫరా చేసింది. మండలంలోని బడన్నపల్లి గ్రామంలో 51వ నంబర్ రేషన్‌షాపునకు శనివారం రాత్రి బియ్యం వచ్చా యి. ప్రతినెలా తక్కువగా బియ్యం రావడంతో అనుమానం వచ్చిన డీలర్ బస్తాలను ఓపెన్ చేయకుండానే తూకాలు వేయించాడు. దీంతో ఒక బస్తా 41కేజీలు, మరో బస్తా 43కేజీలు మాత్రమే తూకాలు వచ్చాయి. దీంతో విస్తుపోయిన డీలర్ స్టాకుపాయింట్ నుంచి వచ్చిన వారితో వాదించాడు. ప్రతినెలా బియ్యం బస్తాల తూకాలు తేడాల్లో వస్తుండటంతో ఆ బియ్యం ఎక్కడికి పోతున్నాయంటూ పలువురు డీలర్లు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ధర్మవరం ఎంఎల్ఎస్ స్టాకుపాయింట్ ఇన్‌చార్జ్ బాలరాజును వివరణ కోరగా స్టాకు తక్కువ వచ్చిన విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే వీటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తూకాల్లో తేడాలు లేకుండా



బడన్నపల్లిలో 50కేజీల బస్తాకు గాను 41.కేజీలు మాత్రమే వచ్చిన దృశ్యం

సకాలంలో ఫ్రీహోల్డ్ పరిశీలన పూర్తి చేస్తాం: కలెక్టర్



పుట్టపర్తి, సెప్టెంబరు 28: సకాలంలో అసైన్‌ల్యాండ్ ఫ్రీహోల్డ్ పరిశీలన పూర్తి చేస్తామని కలెక్టర్ చేతన్ వివరించారు. అమరావతి నుంచి భూపరిపాలనా చీఫ్ కమిషనర్ విజయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫ్రీ హోల్డ్, రిజిస్ట్రేషన్ చేసిన భూముల గురించి జిల్లా కలెక్టర్లతో శనివారం మాట్లాడారు. అందులో పాల్గొన్న కలెక్టర్ ఫ్రీహోల్డ్ భూములపై విచారణ చేస్తున్నామని అక్టోబరు 5 లోపు పరిశీలన ప్రక్రియను పూర్తి చేసి నివేదికలు అందిస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలో ఫ్రీహోల్డ్ ల్యాండ్స్ రిజిస్ట్రేషన్‌పై పునఃపరిశీలనను పూర్తి చేసి అక్టోబరు 1 లోపు నివేదిక సిద్ధం చేసుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకట శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గస్తీ పెంచండి : ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రత్న


బత్తలపల్లి : ప్రతి గ్రామంలో పల్లె నిద్రలు నిర్వహించి.. గస్తీ పెంచాలని ఎస్పీ రత్న సిబ్బందికి సూచించారు. బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేసిన ఆమె మాట్లాడారు. సైబర్ నేరాలకు గురికాకుండా గ్రామీణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. మట్కా, పేకాట, గంజాయి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

ధర్మవరం, సెప్టెంబరు 28 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం తనిఖీ చేశారు. ఎన్నికలలో వినియోగించని.. రిజర్వ్‌లో ఉంచిన ఈవీఎంలను తరలిం చేందుకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఈవీఎం గోదాముల పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు డిప్యూటీ తహసీల్దార్ మైనావుద్దీన్ నాయకులు పాల్గొన్నారు.

స్పందనల సమాహారం హృదయం. సంతోషం కలిగితే ఉప్పొంగుతుంది. బాధకు కుంగిపోతుంది. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లను సమన్వయం చేసుకోలేని మనిషి తీరుతో అలసిపోతోంది. పెరుగుతున్న ఒత్తిడిని తాళలేక తల్లడిల్లిపోతోంది. ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా యువకులు, పిల్లలు సైతం గుండె పోటుతో మృతి చెందుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హృదయరక్ష ఇంజక్షన్లను అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉంచింది. ఆరోగ్యకరమైన జీవన శైలి, దురలవాట్లకు దూరంగా ఉండటమే హృద్రోగ సమస్యలకు పరిష్కారమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డే..

- నెలరోజుల కిందట జిల్లాకేంద్రంలో ఓ మీడియా సంస్థలో పనిచేస్తున్న శేఖర్(40) ఇంట్లో ఉండగా ఉదయమే ఛాతీలో నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు.
- జిల్లాకేంద్రంలోని కళ్యాణదుర్గం రోడ్డు ద్వారకా విలాస్ సమీపంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు మల్లిరెడ్డి(51) ఆరు నెలల కిందట ఉదయమే వాకింగ్‌కి వెళ్లి వచ్చి పేపర్ చదుతూ కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.




- ఏడు నెలల కిందట జిల్లా కేంద్రానికి చెందిన 22ఏళ్ల యువ కుడు ఛాతీలో నొప్పి అంటూ ఇంట్లో పడిపోయాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం సాయినగర్‌లో ఉండే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి, గుండెపోటుగా నిర్ధారించారు. వెంటనే స్టంట్స్ వేయడంతో బతికిపోయాడు. 22 ఏళ్ల యువకుడికి గుండెపోటు రావడం ఆశ్చర్యం కలిగించిందని అక్కడి డాక్టర్ అన్నారు.
- అనంతపురంలో నివాసం ఉండే ఓ ప్రభుత్వ టీచర్ నార్పల మండలంలో పనిచేస్తున్నాడు. తోటి టీచర్‌తో కలిసి ద్విచక్రవాహనంలో వెళుతుండగా దారి మధ్యలోనే కుప్పకూలిపోయాడు. ఏమైందని అతడి వెంట ఉన్న మరో టీచర్ అడగ్గా ఛాతీలో నొప్పి అంటూ అక్కడే ప్రాణాలు వదిలాడు.



హృదయ వేదన

నేడు వరల్డ్ హార్ట్ డే



సూపర్‌స్పెషాలిటీలో హృద్రోగ చికిత్స కేంద్రం

పెరుగుతున్న గుండెపోటు మరణాలు
అధికమవుతున్న హృద్రోగ సమస్యలు
ఆహారం, అలవాట్లు, శారీరకశ్రమ లేనందుకే..
హృదయరక్షణకు సూదిమందు
జాగ్రత్తలే శ్రీరామ రక్ష అంటున్న వైద్యులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 28: మానవ శరీరంలో అతి ప్రధానమైన భాగం గుండె. మారుతున్న పరిస్థితులు, అభిరుచులు, అలవాట్లు, జీవన విధానం వల్ల ఆ హృదయం బరువెక్కుతోంది. ఆటుపోట్లను తట్టుకోలేక తల్లడిల్లి ఆగిపోతోంది. దీంతో మానవులు అకాల మరణం చెందుతున్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. హృదయ వేదనకు మనమే కారణమని పలువురు హృద్రోగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మనుషులు గతంలో మాదిరిగా సమతుల ఆహారం తీసుకోవడంలేదు. శారీరక శ్రమ చేయడం లేదు. జంక్ ఫుడ్‌తోపాటు చిన్న వయసు నుంచే ధూమ, మద్య పానాలకు అలవాటు పడుతున్నారు. టెక్నాలజీ మాయలో పడి సరిగా నిద్రపోవడం లేదు. దీంతో మధుమేహం, బీపీలు, అధిక బరువు పెరిగి గుండె ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తున్నాయి. అందుకే ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు మరణాలు పెరిగినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి.

నాలుగు నెలల్లో 3137మంది బాధితులు

గడచిన నాలుగు నెలల్లోనే ఉమ్మడి జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా 3137మందికి గుండె సంబంధిత చికిత్స అందించినట్లు వైద్య శాఖ రికార్డులు చెబుతున్నాయి. ఇందుకు దాదాపు రూ14.70 కోట్లకు పైగా వ్యయం చేశారు. ఇందులో గుండెపోటుకు గురై శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు 310మంది ఉండగా వీరికి రూ.2.53కోట్లు ఖర్చుపెట్టారు. మరో 2827మంది వివిధ రకాల హృద్రోగ బాధితులకు స్టంట్స్, ఇతరత్రా చికిత్సలు చేశారు. వీరికోసం రూ11.70 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు చెబుతున్నారు. ఈ లెక్కలు సామాన్య ప్రజానీకానికి సైతం ఆందోళన కలిగిస్తున్నాయి.

యువత సైతం..

గతంలో గుండె పోటు అంటే ఏ 70 లేదా 80 ఏళ్ల వాళ్లకు వచ్చి ఉంటుందిలే అనుకునేవాళ్లు. కానీ ఇపుడు 20 ఏళ్లు దాటిన యువకులను సైతం గుండెపోటు భయపెడుతోంది. తీవ్ర ఒత్తిడికి గురికావడం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు వాడటం, అధిక బరువు, చెడు కొలెస్ట్రాల్, నిద్రలేమి, షుగర్, బీపీ కంట్రోల్‌లో పెట్టుకోకపోవడం వల్ల హృదయ ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

అందుబాటులోకి హృదయరక్ష

హృద్రోగ సమస్యలు పెరిగిపోవడం, ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోతుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈహార్ట్ అటాక్‌ల నియంత్రణకు పూనుకున్నాయి. ఇందులో భాగంగా అనేక రకాల వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా హృద్రోగ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. తాజాగా ప్రభుత్వాలు హృదయరక్ష అనే ప్రత్యేక ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రులలో అందుబాటులోకి తీసుకు వచ్చారు. మార్కెట్‌లో ఒక్కో ఇంజెక్షన్ ఖరీదు రూ.42వేలు ఉంటుంది. అంత ఖరీదైన ఇంజక్షన్‌ను బాధితులకు సకాలంలో అందేలా రాష్ట్ర ప్రభుత్వం 24గంటలు వైద్యసేవలు అందించే అన్ని సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉమ్మడిజిల్లాలోని 19సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా సర్వజన ఆస్పత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈహృదయరక్ష ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచారు. గుండెపోటు వచ్చిన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తీసుకొస్తే ఈ ఇంజెక్షన్ వేస్తే బతకడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని డాక్టర్లు అంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే..



ఇటీవల హృద్రోగ బాధితులు పెరిగిపోయారు. స్మోకింగ్, అధిక బరువు, తీవ్ర ఒత్తిడికి, నిద్రలేమి, జంక్ ఫుడ్ తీసుకోవడం, నూనె పదార్థాలు అధికంగా వినియోగించడం వంటి ఆహారపు అలవాట్లు గుండెకు హాని కలిగిస్తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల కూడా హార్ట్ అటాక్‌ల సంఖ్య పెరుగుతోంది. జాగ్రత్తలు పాటించడమే వీటికి విరుగుడు. శరీరబరువు అదుపులో ఉంచుకోవాలి. రోజూ 30నుంచి 40నిమిషాలు తగ్గకుండా నడకగాని వ్యాయామంగానీ చేయాలి. కనీసం రోజుకు 6గంటల నుంచి 8గంటలు నిద్రపోవాలి. ప్రధానంగా ఉప్పు, చక్కెర తక్కువగా తీసుకోవాలి.

- డాక్టర్ వంశీకృష్ణ, పావని ఆస్పత్రి, అనంతపురం

నిర్లక్ష్యం వద్దు



చాలామంది ఛాతీలో నొప్పిని నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గుండెపోటు ఒక్కసారిగా రాదు. దాని లక్షణాలు నెలరోజులు ముందుగానే కనిపిస్తుంటాయి. బాగా చెమట పట్టడం, త్వరగా అలసిపోవడం, ఛాతీలో మంటగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. చాలామంది యువకులు మనకెందుకు గుండెపోటు వస్తుందని, ఏదో తిన్నందుకు గ్యాస్ట్రిక్ అని అనుకుంటూ నిర్లక్ష్యం చేస్తున్నారు. అలాంటివారే ఒక్కసారిగా గుండెపోటుతో వెంటనే ప్రాణాలు కోల్పోతున్నారు. అలాంటి లక్షణాలు కనిపించినపుడు వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షించుకోవాలి. మనం తినే ఆహారం, జీవన విధానంలో మార్పు చేసుకోవాలి. ప్రధానంగా దురలవాట్లకు దూరంగా ఉండాలి.

- డాక్టర్ ఫల్గుణ్, హృద్రోగ నిపుణులు, మార్క్ ఆస్పత్రి, అనంతపురం

రక్షణ బాధ్యత మీ చేతుల్లోనే..



ఒకప్పుడు 60ఏళ్లు దాటినోళ్లకు హార్ట్ అటాక్‌లు వచ్చేవి. ఇపుడు యువకులే హార్ట్ అటాక్‌ల బారిన పడి చనిపోతున్నారు. దీనికి మన అలవాట్లే కారణం. విచ్చలవిడి ఆహారపు అలవాట్లతో గుండె సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. చిన్నవయసువారు హార్ట్ అటాక్‌బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అందుకే ఎవరి గుండె రక్షణ బాధ్యత వారి చేతుల్లోనే ఉంటుంది. హృద్రోగ బాధితులు గతంలో ఎక్కడో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి లక్షలు ఖర్చుపెట్టుకొని చూపించుకోవాల్సి వచ్చేది. ఇపుడు సూపర్‌స్పెషాలిటీలో ప్రభుత్వం ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది.

- డాక్టర్ సుభాష్ చంద్రబోస్, గుండె వైద్యనిపుణులు, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

ప్రాణాలను రక్షించేందుకే హృదయరక్ష సూది



హార్ట్ అటాక్ బాధితుల ప్రాణాలు రక్షించడం కోసమే ప్రభుత్వం హృదయరక్ష ఇంజెక్షన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో ప్రతి సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులతో పాటు జిల్లా ఆస్పత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇవి అందుబాటులో ఉన్నాయి. నిర్దేశించిన ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంచాము. ఇప్పటి వరకు ఈసూదులతో 107మంది ప్రాణాలు కాపాడం. సకాలంలో బాధితుడిని ఆస్పత్రికి తీసుకు వస్తేనే ఈసూది మందు ఫలితం ఇస్తుంది.

- డాక్టర్ రవికుమార్, డీసీహెచ్‌ఎస్

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రాంభూపాల్

రాప్తాడు, సెప్టెంబరు 28: వర్షాభావంతో ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. శనివారం రాప్తాడు సమీపంలో వర్షాభావంతో ఎండిపోయిన రైతు పామళ్ల కొండప్ప పొలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు కొండప్ప 7 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడన్నారు. వర్షాలు సకాలంలో కురవక దిగుబడి తగ్గి రైతు ఆందోళన చెందుతున్నాడని వివరించారు. అన్ని గ్రామాల్లో రైతుల పరిస్థితి ఈ విధంగానే ఉందన్నారు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఆర్థిక సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు పోతులయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజినేయులు, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కదిరప్ప, రైతులు సుబ్బారెడ్డి, వెంకట్రాముడు, పోతులయ్య పాల్గొన్నారు.

నేడు జిల్లాకు కేరళ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి రాక

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28: కేరళ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఆచార్య వీకే రామచంద్రన్ ఆదివారం అనంతపురం విచ్చేయనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లాకేంద్రంలోని అలేఖ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న లెనిన్ శతవర్ధంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారన్నారు.

డీఈఓను సస్పెండ్ చేసి విచారణ చేయాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

అనంతపురం విద్య, సెప్టెంబరు 28: విద్యాశాఖలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, జిల్లా విద్యాశాఖాధికారిని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ చేయాలని నవ్యాంధ్రటీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్‌కు లేఖల ద్వారా ఈ మేరకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కొంతకాలంగా డీసీఈబీలో భారీగా నిధుల గోల్‌మాల్ జరుగుతోందన్నారు. సమగ్ర శిక్ష నుంచి రీ ప్యాట్రేషన్ అయిన టీచర్లకు పోస్టుల కేటాయింపులో నిబంధనలకు తూట్లు పొడిచారని అసహనం వ్యక్తం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానంలో సైతం అవకతవకలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. అనంతపురం జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేయాలని కోరారు.

పత్తి కొనుగోలుకు త్వరలో రిజిస్ట్రేషన్లు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 28: పత్తికొనుగోలుకు త్వరలో రిజిస్ట్రేషన్ ప్రారంభించడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొడుగుపింజ క్వింటా రూ.7,521, పొట్టి పింజకి రూ.7,121 ధరతో కొనుగోలు చేయాలంటూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడం జరిగిందని పేర్కొన్నారు. రైతులు పత్తిని ఆరబెట్టి, శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ప్లాస్టిక్ సంచులను వినియోగించకూడదని సూచించారు. పత్తికి కనీస మద్దతు ధర రావాలంటే పత్తి పింజ పొడవు 29.50ఎంఎం నుంచి 30.50ఎంఎం వరకు ఉండాలన్నారు. మైక్రోనియర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాల్సి ఉంటుందన్నారు. తేమశాతం 8శాతం ఉంటే పూర్తిస్థాయి మద్దతు ధర లభిస్తుందని వివరించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో సమీప రైతు సేవా కేంద్రాల్లో పేర్లను రైతులు రిజిష్టర్ చేయించుకోవాలన్నారు.

విశ్వమానవ సమానత్వాన్ని కాంక్షించిన జాషువా

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా తదితరులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28: తెలుగు సాహితీ పూతోటలో విరబూసిన సాహితీ సుగంధ పుష్పం, విశ్వమానవ సమానత్వాన్ని కాంక్షించిన మహనీయుడు గుర్రం జాషువా అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గుర్రం జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని శనివారం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ముందు ఆయన విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకకు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా అనేక రచనలు చేశారని, ఖండకావ్యాలు రాశారని, వాటిలో గబ్బిలం, పిరదౌసి, క్రీస్తు చరిత్ర అతిముఖ్యమైనవన్నారు. అంటరానితనం, ఆధిపత్యం, వివక్ష, అసమానతలను నిరసిస్తూ సమానత్వ స్థాపనే లక్ష్యంగా సాహిత్య ఆయుధాన్ని చేపట్టిన గుర్రం జాషువాకు నివాళులర్పించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాల్‌లో ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన జాషువా సాహితీ సదస్సులో జాషువా సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, ఎస్కేయూ తెలుగుశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, ఎల్‌కేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశావాది శశాంకమౌళి మాట్లాడారు. జాతి పెడదోరణులను తన కవితా సాహిత్యంతో దునుమాడిన గొప్ప దార్శనికుడన్నారు. కార్యక్రమంలో ఆర్టీటీ తిప్పేస్వామి, పెద్దన్నగౌడ్, ఇంజనీర్ సుధాకర్‌బాబు, ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి, అంకె రామలింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనంతపద్మనాభ ఆలయంలో
మెడికోల నృత్య ప్రదర్శన



నృత్యప్రదర్శన చేస్తున్న అనంత మెడికోలు

అనంతపురం టౌన్/కల్చరల్, సెప్టెంబరు 28: కేరళ అనంతపద్మనాభస్వామి ఆలయంలోని అతుక్కుల్ అమ్మవారి సన్నిధిలో నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి ఆధ్వర్యంలో అనంతమెడికల్ కళాశాల విద్యార్థినులు శుక్రవారం భరతనాట్య ప్రదర్శన చేసి జిల్లాకు గుర్తింపు తెచ్చారు. శ్రద్ధ, దివ్యశ్రీ, కావ్య, హస్విత, మహాలక్ష్మీ, ఉషాశ్యసాయి, మోక్షిత, లాస్యప్రియ, ఇషికప్రియ సుమారు నాలుగు గంటలపాటు నృత్య ప్రదర్శన చేసి ఆహుతులను కట్టిపడేశారు. అదేవిధంగా సంగీత విభావరిలో సంధ్యామూర్తి, నాగమ్మ, వనమాల, భారతి, శోభ, మంజుల, గీత కర్ణాటక శాస్త్రీయ సంగీతంతో ఆకట్టుకున్నారు.

ఆంధ్ర-19 జట్టుకు వీరారెడ్డి ఎంపిక



వీరారెడ్డి



ఖాదిర్‌బాషా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 జట్టుకు వీరారెడ్డి ఎంపికయ్యాడు. 2024-25వ సీజన్‌కు సంబంధించి అక్టోబరు 4వతేదీ నుంచి మొహాలీలో జరగనున్న వినూమన్కడ్ ట్రోఫీకి వీరారెడ్డి ఆంధ్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదేవిధంగా ఆంధ్ర-19 జట్టుకు బీసీసీఐ లెవెల్ ఏ కోచ్‌గా జిల్లాకు చెందిన గులామ్ ఖాదిర్‌బాషా కోచ్‌గా నియమితులయ్యారు.

మైనాస్వామికి ఉత్తమ ప్రచార అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న మైనాస్వామి

గోరంట్ల, సెప్టెంబరు 28: మండలంలోని కరావులపల్లికి చెందిన చరిత్రకారుడు మైనాస్వామికి ఉత్తమ ప్రచార అవార్డు లభించింది. ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఆర్కిటెక్చర్ అండ్ హార్ట్ ఆఫ్ విజయనగర- 'లేపాక్షి' అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన రచించారు. ఆయనకు జ్ఞాపికతోపాటు మెడల్, ప్రశంసాపత్రాన్ని ఇచ్చి సత్కరించారు. అవార్డు లభించడం పట్ల ఆయనను పలువురు అభినందించారు.

రికార్డులు పక్కాగా ఉండాలి: ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 28: అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలని ఎస్ఈ ఎహసాన్‌బాషా సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన శనివారం పరిశీలించారు. వివరాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను, పంపింగ్ సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ ఆంజినేయులుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పార్లమెంట్‌స్థాయి కమిటీ సభ్యుడిగా బీకే



పెనుకొండ, సెప్టెంబరు 28: పార్లమెంట్ స్థాయి ఉక్కుగనులు, బొగ్గుశాఖ కమిటీ సభ్యుడిగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారధిని నియమించారు. తనను నియమించిన ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీశాఖ మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీకే పార్థసారధి తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

ఫ్రెషర్స్‌డేలో వీసీ సుదర్శనరావు



అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 28: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు అన్నారు. శనివారం కళాశాల ఆడిటోరియంలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఫ్రెషర్స్‌డేకు ముఖ్య అతిథిగా వీసీ సుదర్శనరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ దేశ, విదేశాల్లో జేఎన్‌టీయూ పూర్వపు విద్యార్థులు పలురంగాల్లో ఉన్నత శిఖరాలను అందుకున్నారన్నారు. పాఠ్యాంశాల బోధన, ల్యాబ్‌ల సౌకర్యం అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధ, ప్రొఫెసర్లు ఆనందరావు, విజయకుమార్, నాగప్రసాద్‌నాయుడు, శేఖర్ రాజు, శివకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో సీఐ మృతి



నల్లమాడ, సెప్టెంబరు 28 : మండలంలోని అరవాండ్లపల్లికి చెందిన సీఐ అర్జున్ నాయక్ (57) కడప జిల్లాలోని సెంట్రల్ క్రైం స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించేవారు. శనివారం తెల్లవారు జామున ఆయన గుండెపోటుతో మరణించాడు. ఆదివారం స్వగ్రామంలో పోలీస్ లాంచనాలతో అతని అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బంధువులు చెప్పారు. అర్జున్‌కు ఇద్దరు కుమార్తెలున్నారు.

అనారోగ్యంతో సీపీఐ నాయకుడు..

నల్లమాడ: మండలంలోని మీసాలవాండ్లపల్లికి చెందిన సీపీఐ నాయకుడు అయ్యాసాబ్ (58) అనారోగ్యంతో శనివారం మరణించాడు. అతను 35 సంవత్సరాలుగా సీపీఐలో కీలకంగా పనిచేశారు. అతనికి భార్య సాదాబీ, ఇద్దరు కుమారులున్నారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక పోలీసులకు గాయాలు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 28 : మండలంలోని రాంపురం క్రాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం తూముకూరు జిల్లా మద్దిగిరి పోలీసులు గాయపడ్డారు. చీటింగ్ కేసు విషయంలో దొంగలను పట్టుకునేందుకు మద్దిగిరి ఎస్ఐ అమ్మన్నగారి, కానిస్టేబుల్స్ రమేష్, ప్రకాష్, ముద్దరాజ్ కారులో బయలుదేరారు. రాంపురం క్రాస్ వద్ద కుక్క అడ్డురావడంతో కారు అదుపుతప్పి.. బోల్తాపడింది. దీంతో ఎస్ఐకు స్వల్ప, కానిస్టేబుల్స్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

బుక్కపట్నం, సెప్టెంబరు 28 : మండలంలోని దూపంపల్లి గ్రామ సరిహద్దులో కోడిపందెలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ క్రిష్ణమూర్తి శనివారం తెలిపారు. ఇందులో సీకేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు, ధర్మవరానికి చెందిన ఓ వ్యక్తి ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.23, 500లను, ఆరు పందెం కోళ్లను, 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కోటూరు వద్ద జూదరులు..

తనకల్లు : మండలంలోని కోటూరు గ్రామ సమీపంలో శనివారం రాత్రి జూద మాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. వారి నుంచి రూ.10,165 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన

తనకల్లు, సెప్టెంబరు 28: మండలంలోని ఆటో డ్రైవర్లకు ఎస్ఐ గోపి ట్రాఫిక్ రూల్స్‌పై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫారం ధరించాలని, లైసెన్సులు కలిగి ఉండాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని, అధిక వేగం, అధిక లోడుతో ప్రయాణం నేరమని అన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

చీకటిమానుపల్లిలో పోషకాహార మాసోత్సవాలు

తనకల్లు, సెప్టెంబరు 28 : మండలంలోని చీకటిమానుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను శనివారం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, తల్లులకు పోషకాహార ప్రాధాన్యతపై ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నాగమల్లేశ్వరీ అవగాహన కల్పించారు. ఇందులో సీడీ పీఓ గంగరత్న, సూపర్‌వైజర్ లక్ష్మీదేవ మ్మ, రఫీమునీషా, పద్మావతమ్మ, జయమ్మ, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా శ్రీనివాస్



గాండ్లపెంట, సెప్టెంబరు 28: మండల ట్రాన్స్‌కో ఏఈగా ఎంకె. శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను గోరంట్లలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఏఈ విశ్వనాథ్ నల్లమాడకు బదిలీపై వెళ్లారు.

భగత్‌సింగ్‌కు నివాళి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 28: భగత్‌సింగ్ 115వ జయంతి సందర్భంగా స్థానిక ఆటోస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి స్థానిక సీపీఎం, సీఐటీయూ నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సున్నంపల్లి రమణ, శ్రీరాములు, కుళ్లాయప్ప, నరసింహులు, శాంతమ్మ, శివమ్మ, అజయ్, శంకర్, దేవాన్ పాల్గొన్నారు.

కదిరి, (అమడగూరు) : భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ జిల్లాన్‌బాషా, ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌బాబు, సర్పంచ్ షబ్బీర్, టైలర్ రామాంజి, దొడ్డెం మూర్తి, యూత్ అసోషియేషన్ సభ్యుడు దొడ్డెం అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎం. ఎర్రబల్లిలో ఉచిత వైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 28: తంగేడుకుంట పంచాయతీలోని ఎం. ఎర్రబల్లిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో పదేళ్ల బాలికకు డెంగీ సోకడంతో ఈ వైద్యశాఖ అప్రమత్తమైంది. పలువీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఇంటింటా తిరిగి సర్వే చేశారు. ఇంటి పెరటి, పరిసరాల్లో నీటి నిలువల్లో లార్వాలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి దేవలానాయక్, సూపర్‌వైజర్లు శశిధర్, విజయ్‌కుమారి, సిబ్బంది మద్దిలేటి మనోహర్, బిందుభార్గవి, శ్రీనివాసులరెడ్డి, అఖిల, సురేంద్ర, ఆశకార్యకర్తలు జ్యోష్నా, కుళ్లాయమ్మ, మునిరత్నమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

కొత్తచెరువు, సెప్టెంబరు 28 : విజయవాడ బాధితులకు చేయూతగా మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ రూ.50,116, మాజీ సర్పంచ్ మాణిక్యంబాబా రూ.25,000ను ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డికి శనివారం అందజేశారు. దాతలను ఎమ్మెల్యే అభినందించారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై మంత్రి సమీక్ష

ధర్మవరం, సెప్టెంబరు 28 : మున్సిపాలిటీ అభివృద్ధిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా కోసం ప్రణాళికలు రూపొందించాలన్నారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు, ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పట్టణ ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి, సెప్టెంబరు 28: శ్రీసత్యసాయి జిల్లాలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, హిందూపురం ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అక్టోబరు 1వ తేదీ నుంచి 8వ తేదీ లోపు దరఖాస్తులను జిల్లా పీడీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. స్టోర్ కీపర్లు-2, కుక్-1, ఎడ్యు కేటర్-2, మ్యూజిక్ టీచర్లు-4, యోగా టీచర్లు-2, హౌస్ కీపర్లు-2, వాచ్‌మెన్-1 ఖాళీగా ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు శ్రీ సత్యసాయి.ఏపి.జీఓవి.ఇన్ వెబ్ సైట్‌ను సందర్శించాలన్నారు.

కమిషనర్ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



హిందూపురం, సెప్టెంబరు 28: హిందూపురం మునిసిపల్ కమిషనర్‌గా సంఘం శ్రీనివాసులు శని వారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కాకినాడకు బదిలీచేయగా సంఘం శ్రీనివాస్ హిందూపురం కమిషనర్‌గా నియ మితులయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ మునిసిపా లిటీకి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించి పట్ట ణాభివృద్ధికి సహకరించాలన్నారు. కమిషనర్‌కు టీడీపీ కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

టమోటా కిలో రూ.46



అనంతపురంరూరల్, సెప్టెంబరు 28: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 1350 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.30 పలికినట్లు తెలిపారు.

విలీనం.. కళావిహీనం



తూపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

- భ్రష్టుపట్టిన ప్రభుత్వ పాఠశాలలు
- పలు స్కూళ్ల మూసివేత
- నిరుపయోగంగా భవనాలు
- ప్రజాధనం వృథా
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

గాండ్లపెంట, సెప్టెంబరు 28 : గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్లక్ష్యం.. ప్రభుత్వ పాఠశాలలను కోలుకోలేని దెబ్బతీసింది. విలీనం పేరుతో వాటిని కళావిహీనంగా మార్చింది. గత ప్రభుత్వంలో రూ.కోట్లు ఖర్చు చేసి నాడు - నేడు పేరుతో పలు పాఠశాలల్లో అనేక గదులను నిర్మించారు. సౌకర్యాలు కల్పించారు. రంగులు వేశారు. అయితే పాఠశాలలను విలీనం పేరుతో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థులను విలీనం చేశారు. దీంతో పాఠశాలలు విద్యార్థులు లేక మూతబడ్డాయి. విద్యార్థులు దూరంగా ఉన్న ఆ పాఠశాలలకు వెళ్లలేక చదువులకు దూరమయ్యారు.

నిధులు వృథా

కేవలం మండలంలో నాడు - నేడు పేరుతో మొదటి విడతగా రూ.2.18 కోట్లను ఖర్చు చేశారు. బయ్యారెడ్డిగారిపల్లిలో ప్రాథమిక పాఠశాలకు రూ.9.2 లక్షలు, కటారుపల్లి రూ.18.92 లక్షలు, గాండ్లపెంట రూ.29.77 లక్షలు, నీరుకుంట్లపల్లి రూ.20.65 లక్షలు, కమతంపల్లి రూ.12.89 లక్షలు, వేపలకుంట రూ.13.58 లక్షలు, తుమ్మలబైలు రూ.11.12 లక్షలు ఖర్చు చేశారు. అలాగే మరియుతూపల్లి రూ.20.81 లక్షలు, ప్రాథమికోన్నత పాఠశాలను, కస్తూరిబా పాఠశాలను రూ.56.41 లక్షలతో తరగతి గదుల్లో బల్లలు, ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, నీరు, విద్యుత్, ఫ్యాన్లు తదితర వాటిని అమర్చారు. అనంతరం విలీనం చేయడంతో అనేక గదులు నిరుపయోగంగా మారాయి.

తగ్గిన విద్యార్థులు

తూపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలతో 87 మంది, గాండ్లపెంట ప్రాథమిక పాఠశాలలో 137 మంది. కటారుపల్లిలో 87 మంది, తుమ్మలబైలులో 25 మంది, రెక్కమానులో 30 మంది, పీఎం తండాలో 13 మంది. కె. మాలపల్లిలో 12 మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకొనేవారు. 2022లో వైసీపీ ప్రభుత్వం మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాలలను విలీనం చేసింది. దీంతో ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు తూపల్లిలో 22 మంది, గాండ్లపెంట ప్రాథమిక పాఠశాలలో 20 మంది, కటారుపల్లిలో 30 మంది, తుమ్మలబైలులో ఎనిమిది మంది, రెక్కమనులో 10 మంది, సిఎం తండాలో ముగ్గురు, కె. మాలపల్లిలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అంతేకాకుండా ఇతర పాఠశాలల్లో విలీనం వల్ల.. దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లలేక అనేక మంది విద్యార్థులు చదువు మానేశారు. ఈ విలీనం రద్దు చేసి... గతంలో మాదిరిగానే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దూర ప్రాంతాలకు తమ పిల్లలు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. అంతేకాకుండా మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతూనే ఉంది. గాండ్లపెంట జిల్లాపరిషత్ ఉన్నపాఠశాలలతో 2021-22కు వీలీనం కాకముందు 6 నుంచి 10 వరకు 739 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 2024-25లో 3 నుంచి 10వరకు 481 మందే ఉన్నారు. పాఠశాలల విలీనంతో చదువులు అటకెక్కుతున్నాయని తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

మూతపడిన పాఠశాలలు

తూపల్లిలో దాదాపు ఏడు తరగతి గదుల మరమ్మత్తులకు రూ.21 లక్షలు ఖర్చు చేశారు. గతంలో ఈ పాఠశాలలో 1నుంచి 7వరకు 87మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 1నుంచి 5వరకు 22మంది మాత్రమే ఉన్నారు. ఈ విద్యార్థులకు రెండు గదులు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. మిగిలిన ఐదు గదులు నిరుపయోగంగా ఉన్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి గాండ్లపెంట ఉన్నతపాఠశాలలోకి మార్చడంతో ప్రజాధనం వృథాగా మారింది. గాండ్లపెంట, కటారుపల్లి పాఠశాలలు నిరుపయోగంగా ఉండడంతోవాటిని అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు.



తూపల్లిలో ఖాళీగా ఉన్న తరగతి గది



తూపల్లిలోనే పాఠశాలను కొనసాగించాలని నిరసన వ్యక్తం చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు (ఫైల్)

విలీనంతో ఇబ్బందులు



తూపల్లిలో పిల్లలు 1 నుంచి 7 వరకు చదువుకోవడానికి అవకాశముండేది. విలీనం పేరుతో పిల్లలను గాండ్లపెంటకు పంపాల్సి వస్తోంది. నా కుమారుడు ఆరో తరగతి చదువుతు న్నాడు. వెళ్లిరావడం ఇబ్బంది ఉంది. తిరిగి తూపల్లిలో ఏడో త రగతి వరకు కొనసాగించాలి.

- షాహీదా, తూపల్లి

నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు



ఆడపిల్లలు రోజు తూపల్లి నుంచి గాండ్లపెంటకు నాలుగు కిలోమీటర్ల మేర నడుచుకుని పోయి, రావాల్సి ఉంది. పైగా పిల్లలకు పుస్తకాల మోత. ఆడపిల్లలు పంపాలంటేనే తల్లిదండ్రులు అందరూ భయపడుతున్నారు. గతంలో తూపల్లి మీదుగా మల్లమీదపల్లికి బస్సు సౌకర్యముండేది. ఐదు సంవత్సరాల నుంచి బస్సు సౌకర్యమూ లేదు. మా గామంలోనే పాఠశాలను కొనసాగించాలి

- షక్కీలా, తూపల్లి

వైసీపీ నాయకుల పూజలు

కదిరి, సెప్టెంబరు 28: తిరుపతి లడ్డూ వివాదం నేపథ్యంలో రాష్ట్ర వైసీపీ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులు శనివారం పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అందులో భాగంగా వైసీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు కదిరిలోని ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. తిరుపతి లడ్డూపై కూటమి నాయకులు అసత్యప్రచాలు చేస్తున్నారని ఆరోపించారు.

ధర్మవరంరూరల్ : మండలంలోని చిగిచెర్లలో నాగులకట్ట వద్ద ఉన్న స్వాములకు వైసీపీ నాయకులు పూజలు నిర్వహించారు. ఇందులో వైసీపీ నాయకుడు, ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, శాప్ మాజీ డైరెక్టర్ ఓబిరెడ్డి, సర్పంచ్ బాబయ్య, నాగలూరు మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైసీపీ నాయకులు

రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో చోరీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 28 : ఓ రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో దొంగలు పడ్డారు. ఆ కుటుంబం షిర్డీకి వెళ్లిన సమయంలో అదను చూసిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. రిటైర్డ్ ఎస్ఐ వీరాంజేయులు గణేష్‌నగర్‌లో నివాసముంటున్నారు. కుటుంబంతో కలిసి ఆయన ఈనెల 25వతేదీ రాత్రి షిర్డీకి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇం టికి వచ్చారు. ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా ఉండటంతో దొంగ తనం జరిగిందని తెలుసుకున్నారు. బీరువాలో ఉండాల్సిన 12 గ్రా ముల బంగారు గొలుసు, డైమండ్ రింగ్, డైమండ్ నెక్లెస్ దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెనుకపక్క బాత్‌రూమ్ కిటికీని తొలగించి దొంగలు ఇంట్లోకి వెళ్లినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఆ సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన యువత అర్హులన్నారు. బెంగుళూరులో 35రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజనం, సదుపాయాలు క ల్పిస్తామన్నారు. అనంతరం నూరు శాతం నెలకు రూ.15వేలకు పైగా వేతనం ఉపాధి కల్పిస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నం. 9000487423ను సంప్రదించాలని కోరారు.

సమస్యలపై దృష్టి పెట్టండి

గార్లదిన్నె, సెప్టెంబరు 28 : రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని రైతు సంఘం నాయకులు ఆర్డీఓ వసంతబాబును కోరారు. ఆత్మహత్య చేసుకున్న రైతు సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో మాటా డేందుకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీఓను రైతు సంఘం, సీపీఎం నాయకులు కలిశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఆర్డీఓతో మాట్లాడారు.

దుస్తుల పంపిణీ

హిందూపురం(పరిగి) : పంచాయతీ పరిధి లోని 25 మంది పారిశుధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేశారు. పండుగ ముందస్తుగానే కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందని పంచాయతీ కార్యదర్శి అరుణ ఈ సందర్భంగా తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా

ధర్మవరం, సెప్టెంబరు 28 : కేరళలో ఈనెల 22, 23, 24 తేదీల్లో ఇండియా ఉమెన్స్ నేషనల్ వీఎన్‌కే ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి జూడో పోటీల్లో ధర్మవరానికి చెందిన కురుబ గవ్వల యువసంధ్య మైనస్ 28 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. యువసంధ్య స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. అలాగే పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న అక్షయాని గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీలకు ఎంపికైంది. శనివారం ఈ ఇద్దరు విద్యార్థులను ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓలు

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపిక

ధర్మవరం: రాష్ట్ర హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు పావని ప్రవిత, సింధు ఎంపిక య్యారు. ఈ నెల 30 నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు జార్ఖండ్ రాజధాని రాంచిలో జరుగుతున్న 14వ జాతీ య స్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో వీరు పాల్గొంటారు. అదేవిధంగా కోచ్‌గా సత్యసాయి క్రీడా సాధికార సంస్థ హాకీ కోచ్ ఉస్సేన్ వ్యవహరిస్తున్నారని హాకీ అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి బందనాధం సూర్యప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు తెలిపారు.



ఎంపికైన ధర్మవరం క్రీడాకారులు

నల్లచెరువు విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నల్లచెరువు: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ, జిల్లా స్థాయి లో క్రీడాపోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పదో తరగతి విద్యార్థిని ఎస్ సుజైన్ అండర్ 17 విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం, 4 ఇన్ టూ వంద పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే పలు వురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయి క్రీడల్లో రాణించి.. జిల్లా స్థాయికి ఎంక య్యారు. వారిని శనివారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ...

కదిరి అర్బన్ : స్కూల్ గ్రేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహిం చిన నియోజకవర్గస్థాయి క్రీడాపోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ బాలకలు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు అర్చన, సాయిప్రియ, షమీరా, స్వప్న, భవిత, భవ్య, మోక్షిత, స్నేహ, లావన్య, సింధూ, దామినీ, దివ్యను ప్రధానోపా ధ్యాయుడు వెంకటా చలం, పీడీలు శంకర్‌నాయక్, యశోద, సుజాత శనివారం పాఠశాలలో అభినందించారు.



క్రీడాపోటీలకు ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

పేదల సొంతింటి కల నిజం చేస్తాం

'మన ఇళ్లు - మన గౌరవం'లో మంత్రి, ఎమ్మెల్యేలు

ధర్మవరం, సెప్టెంబరు 28 : పేదల సొంతింటి కల నిజం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని తుంపర్తిలో నిర్వహించిన మన ఇళ్లు-మన గౌరవం అనే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు మంత్రి అవగాహన కల్పించారు. కేంద్ర, ప్రభుత్వ పథకా లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుంపర్తి కాలనీకి త్వరలో చౌకదుకాణాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



తుంపర్తిలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కదిరి : ఇది పేదల ప్రభుత్వమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన మన ఇళ్లు, మన గౌరవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై ఇంకా నిర్మాణం పూర్తి చేసుకోనివారు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో నాలుగువేల ఇళ్లు మంజూరుకాగా.. మూడు వేల ఇళ్లు వివిధ దశలో ఆగిపోయాయని, మిగిలిన వెయ్యి అసలు పనులే మొదలు పెట్టలేదని అన్నారు. వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సిమెంటు, ఇసుక ఉచితంగా సరఫరా చేస్తుందని, త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వంలో కూడా కొంతమంది నాయకులు ఇళ్లపట్టాలు, ఇళ్లు పేరుతో వ్యాపారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి వారిని హెచ్చరిస్తున్నట్లు చెప్పారు. అసలు ఇంటి నిర్మాణ పనులే ప్రారంభించని ఆ వెయ్యి మందికి నోటీసు లు పంపాలని, 15 రోజుల్లో వీటి నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాకపోతే, వాటిని రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు.

మురుగునీటి శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన

మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల సమీపంలో మురుగునీటి శుద్ధి కేంద్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పట్టణం నుంచి వచ్చే మురునీటిని శుద్ధి చేసి, ఆ నీటిని రైతుల పొలాలకు తిరిగి పంపేందుకు ఈ శుద్ధి కేంద్రాన్ని ప్రభుత్వం రూ.25 కోట్లతో నిర్మిస్తోందన్నారు.

పుట్టపర్తి : స్థానిక బ్రాహ్మణపల్లి ఎన్టీఆర్ కాలనీలో నిర్వహించిన మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొన్నారు. పేదలకు సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇల్లు లేని నిరుపేద లందరికి ఇల్లు స్థలాలు మంజూరుతో పాటు పక్కా గృహాలు అందిస్తా మని, అదే విధంగా సీసీ రోడ్డు, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. హౌసింగ్ పీడీ వెంకట నారాయణ మాట్లాడుతూ.. ఇల్లు నిర్మించుకునే లబ్దిదారులకు వారానికి ఒక మారు బిల్లు చెల్లిస్తామన్నారు. వచ్చే మార్చి నాటికి ఇల్లు పూర్తి చేసుకోకపోతే ఇల్లు రద్దు అవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, డీఈ వెంకటరమణారెడ్డి, కమిషనర్ ప్రహల్లాద, నాయకులు పాల్గొన్నారు.





కదిరి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట, పుట్టపర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 28: గ్రామైక్య సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, వాటిని సకాలంలో చెల్లించాలని ఏరియా కో-ఆర్డినేటర్ రామమోహన్, శ్రీనిధి ఏజీఎం వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన పల్లవి మండల సమాఖ్య 21వ వార్షిక మహాసభలో వారు మాట్లాడారు. గ్రామైక్య సంఘాల ద్వారా అందరూ ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం పాలక వర్గ సభ్యులను ఎంపిక చేశారు. నూతన పాలకవర్గం అధ్యక్షురాలుగా ఎం. వెంకటలక్ష్మీ, కార్యదర్శిగా వై. లక్ష్మీదేవి, కోశాధికారిగా వరలక్ష్మీ, ఉప కార్యదర్శిగా ప్రమీలమ్మ, ఉపాధ్యక్షురాలుగా భూదేవిని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం రమణప్ప, గ్రామైక్య సంఘం సభ్యులు, లీడర్లు, సీసీలు పాల్గొన్నారు.

టీడీపీ సమావేశాన్ని విజయవంతం చేయండి

మడకశిరటౌన్, సెప్టెంబరు 28: నియోజకవర్గంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కోరారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ సమీపంలోని మార్కెట్‌యార్డులో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని పట్టణ, మండల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రజా సేవలో భాగస్వాములు కావాలి



వరద బాధితులకు కిట్లను అందజేస్తున్నజపానందస్వామి

పావగడ, సెప్టెంబరు 28: బెంగళూరు సుధామూర్తి ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సంస్థ పావగడ రామక్రిష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి వరద బాధితులకు చేపడుతున్న సేవలు అమోఘమని బీజేపీ ఎంపీ సుజనా చౌదరి కొనియాడారు. శుక్ర, శనివారాలలో విజయవాడలోని వరద బాధితులకు జపానందస్వామి నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొని ఆశ్రమ సేవలను ఎంపీ కొనియాడారు. వరదల వల్ల నిరాశ్రయులైన బాధితులను ఆదుకోవడానికి మానవతా దృష్టితో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. జపానందస్వామికి అక్కడి ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు కనకదుర్గమ్మ ఆలయంలో ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


భవిష్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోరంట్ల, సెప్టెంబరు 28: పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో 10వతరగతి చదువుతున్న భవిష్య రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మాధవీలత తెలిపారు. పట్టణంలో నివసిస్తున్న ఆర్టీసీ కండెక్టర్ ప్రవీణ్, పద్మల కుమార్తె భవిష్య అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్ 19 విభాగం బాల్ బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఉపాధ్యాయులు లక్ష్మీ, పీడీ సూర్యనారాయణమ్మ విద్యార్థిని అభినందించారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు..



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జాఫర్, పీడీ నారాయణస్వామి

అగళి, సెప్టెంబరు 28: మడకశిర తాలూకా స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో పది మంది మోడల్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జాఫర్, పీడీ నారాయణస్వామి తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో జావలిన్‌త్రోలో శ్రీనాథ్, చెస్‌లో ధనుష్, కబడ్డీలో హృదయచంద్ర, నందీష్, వాలీబాల్‌లో హృదయచంద్ర, నందన్, అథ్లెటిక్స్ 3కే రన్‌లో సూర్యనాయక్, షాట్‌పుట్‌లో శ్రీనాథ్, అండర్-14విభాగంలో యశ్వంత్, జయంత్, బాలికలలో మేఘన, యశస్విని, సుధ ఎంపికయ్యారన్నారు. 1, 4తేదీలలో అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ రమేష్‌కుమార్

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 28: విద్యార్థులకు క్రీడల వల్ల శారీకర ధృడత్వం పెంపొందడమే కాకుండా మనో వకాసానికి ఎంతగానో దోహదపడుతుందని ఎంఈఓ గంగప్ప, 6వ వార్డు కౌన్సిలర్ రమేష్ అన్నారు. శనివారం స్థానిక ఎంజీఎం ఆటల మైదానంలో నిర్వహించిన హిందూపురం మండల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. 14 సంవత్సరాలలోపు, 17 సంవత్సరాలలోపు బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. హిందూపురం మండలంలోని 39 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఎమ్మెల్యే పీఏ బాలాజీ, హెచ్‌ఎం సామ్రాజ్యం, పీడీలు లోకనాథ్, రామకృష్ణ, సురేష్, శ్రీనివాసులు, నాగమణి, సరళ పాల్గొన్నారు.

రేపు బాలుర ఫుట్‌బాల్ సీనియర్ జట్టు ఎంపిక

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 28: సత్యసాయి జిల్లా బాలుర ఫుట్‌బాల్ సీనియర్ జట్టును 30వ తేదీన ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.వి. అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంజీఎం ఆటల మైదానంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు సీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మండల ఫుట్‌బాల్ క్లబ్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. వివరాలకు 8099598958 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 28: పంచాయతీ పరిధిలోని 25 మంది పారిశుధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేశారు. పండుగ ముందస్తుగానే కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందని పంచాయతీ కార్యదర్శి అరుణ తెలిపారు. సర్పంచ్ లక్ష్మీశివశంకర్, సచివాలయ సిబ్బంది గౌస్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 28: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని టీడీపీ నాయకులు అన్నారు. అమరాపురం మండలంలోని కె.శివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, పంచాయతీ కార్యదర్శి నాగమణి పాల్గొన్నారు. నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్ మాట్లాడుతూ మొక్కలు నాటి నీరు పోసి వారిటిని పరిరక్షించాలని కోరారు. మండల కన్వీనర్ గణేష్, జయకుమార్, పంచాయతీ కార్యదర్శి నాగమణి, మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు

తిరుమలకు వెళ్లడం ఇష్టంలేకే దొంగ నాటకాలు

● జగన్‌పై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపాటు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 28 : తిరుమలకు వెళ్లడం ఇష్టం లేక నీ పర్యటనను రద్దు చేసుకొని దొంగ నాటకాలు ఆడటం సరికాదంటూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. తి రుమలకు వెళ్లవద్దని నీపై ప్రభుత్వం ఆంక్షలు విధించిందా..?పోలీసులు నీకే మైన నోటీసులు ఇచ్చారా? అని ప్రశ్నించారు. స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరు మలలో డిక్లరేషన్ ఇవ్వకపోతే ఆలయ అధికారులు ప్రవేశాన్ని అడ్డుకుంటారని, జగన్ తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నారని అన్నారు. ఆయన వ్య క్తిగత సమస్యతో పర్యటన రద్దుచేసుకుని... ప్రభుత్వం, పోలీసులు, దళి తులపై నెపాన్ని నెట్టాలని చూడటం దారుణమన్నారు. గత వైసీపీ హయాం లో 230 మంది దళితులను ఊచకోత కోయించావని, ఆరువేల మంది కి పైగా దళితులపై అక్రమ కేసులు పెట్టించారని జగన్‌పై మండిపడ్డారు. దళిత కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులును దుర్వియోగం చేశాడన్నారు. తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న సందర్భంలో ఏ కా రణాలు చెప్పాలో తెలియక... తననే తిరుమలకు వెళ్లనివ్వడం లేదంటే , ఇక దళితుల పరిస్థితి ఏమిటని సంబంధంలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. స్వార్థ రాజకీయం, స్వలాభం కోసం దళితులను పావుగా వాడుకోవాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ హయాంలో జంతువుల కొవ్వు ద్వారా వచ్చే ఆయిల్‌తో తిరుమల లడ్డూను తయారు చేశా రని ప్రభుత్వం నిరూపిస్తే.. అది అవాస్తవమని జగన్ నిరూపించుకోవా లన్నారు. ఇకపోతే మానవత్వం, హిందూమతం గురించి ఆయనకు మాట్లాడే అర్హతలేదన్నారు. ఆయన వ్యక్తిగత, స్వలాభం కోసం హిందువులను అవమానిస్తూ, దళితులను బలిచేస్తానంటే ఇక్కడెవరు ఉపేక్షించే పరిస్థితిలో లేరన్నారు. లడ్డూను కల్తీ చేసినందుకు శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పడంతో పాటు ఇది దేశమేనా అన్నందుకు దేశ ప్రజలకు, రాష్ట్రంలోని దళితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి ఆలయంలో దళితుల ప్రవేశానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. జగన్‌లాగా రాజకీయ స్వ లాభం కోసం మతాలు, కులాలను వాడుకునే తత్వం సీఎం చంద్రబాబుకు లేదన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

తిరుమల లడ్డూ వివాదంపై పోటాపోటీ పూజలు


పెనుకొండలో ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రి శంకర్‌నారాయణ

పెనుకొండ రూరల్/పెనుకొండ, సెప్టెంబరు 28: తిరుమల లడ్డూ వివాదంపై వైసీపీ నాయకులు పోటాపోటీగా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై కూటమి నేతల ప్రచారాలను ఖండిస్తూ శనివారం పెనుకొండలో శంకర్‌నారాయణ వర్గం, ఉషశ్రీ వర్గం పోటాపోటీగా పూజలు నిర్వహించారు. శంకర్‌నారాయణ వర్గం మడకశిర రహదారిలోని స్వగృహం నుంచి అనుచరవర్గంతో ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైసీపీ జిల్లా అధ్యక్షులు ఉషశ్రీ చరన్ అనుచరులతో ఆలయంలో పూజలు నిర్వహించారు. శంకర్‌నారాయణ మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఉషశ్రీ మాట్లాడుతూ కలియుగదైవం వేంకటేశ్వరస్వామిపై ఇలాంటి రాజకీయాలు చేయడం దారుణమన్నారు.


పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

ఆలయంలో వైసీపీ నాయకుల పూజలు


కొబ్బరికాయలు కొడుతున్న వైసీపీ నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 28: పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయంలో వైసీపీ నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు కొబ్బరికాయలు కొట్టారు. వైసీపీ నాయకుడు వేణురెడ్డి మాట్లాడుతూ తిరుమల పవిత్రతను స్వామివారి విశిష్టతను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు. లడ్డూ పవిత్రతను రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు.

గుడిబండ: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం సర్పంచులు ఎంజేరుగౌడ్, కరుణాకర్, రంగస్వామి, ఆలయంలో పూజలు నిర్వహించారు.

గోరంట్ల: పట్టణంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో వైసీపీ నాయకులు శనివారం పూజలు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీకి సంబంధించి పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పూజలు చేశారు. కన్వీనర్ వీర నారాయణరెడ్డి, పాలే జయరాంనాయక్, రాజారెడ్డి, పోతుల రామక్రిష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, మేదర శంకర్ పాల్గొన్నారు.

సాహితీ సంస్కృతులపై విద్యార్థులకు అవగాహన


బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

గోరంట్ల, సెప్టెంబరు 28: సాహిత్యం, సంస్కృతి, ప్రాచీన కళలను ప్రోత్సహించడానికి సాహితీ సాంస్కృతిక వేదిక కృషి చేస్తోంది. ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం వేదిక నిర్వాహకులు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మక కళలను వెలికి తీయడానికి ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. హస్యప్రియులు కోగిర జయచంద్రారెడ్డి, రంగస్థల నటుడు గోటు శంకర్ తమ ప్రసంగాలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. చిన్నారులు లాస్య, గ్రీష్మబాయి భరతనాట్యం, జానపద నృత్యాలతో అలరించారు. సీనీ నిర్మాత జీఎం సురేష్, రచయిత నరేంద్రుల రాజారెడ్డి, సంఘ సేవలకులు జగదీశ్వర్, ప్రిన్సిపాళ్లు భక్తవత్సలం, విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ వివాదంపై నేడు భారీ ర్యాలీ

పెనుకొండ, సెప్టెంబరు 28: హిందువుల ఆరాధ్య దైవం వేంకటరమణస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డూను కల్తీ చేసిన సంఘటనపై ఆదివారం పెనుకొండలో హిందూ సంఘాలు భారీ ర్యాలీ, ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూపరిషత్ నాయకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు వీహెచ్‌పీ, బజరంగదళ్, ఆర్ఎస్ఎస్, జైక్రిష్ణ ధర్మసేవ పరిరక్షణ సమితి, వినాయక ఉత్సవ కమిటీ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఘనగిరి లక్ష్మీప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో శారీరక శుద్ధిచేసి పూజలు నిర్వహిస్తామన్నారు. హిందువులందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు ఏచూరి సంతాప సభ

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 28: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారం సంస్మరణ సభ ఆదివారం ఉదయం 11 గంటలకు చౌడేశ్వరీ కాలనీలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. పట్టణ పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వెల్లడించారు. సీతారం ఏచూరి ఉమ్మడి జిల్లా ప్రజలకు అందించిన సేవలను స్మరించుకుంటూ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటలేశ్వర్లు హాజరవుతారన్నారు. ముఖ్య నాయకులు, కార్మికులు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు.

స్వర్ణాంధ్ర-2047పై వ్యాసరచన పోటీలు

రొళ్ల, సెప్టెంబరు 28: స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర-2047పై వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి కార్తీక్, గురుకుల పాఠశాల, వక్తృత్వ పోటీల్లో మొదటి బహుమతి భానుప్రసాద్, గురుకులపాఠశాల, ఆర్.ఐశ్వర్య వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి నందీశ్వర్‌రెడ్డి, రెండో బహుమతి భానుప్రసాద్, మండల స్థాయిలో గెలుపొందారు. అక్టోబరు 30వ తేదీన నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, సెప్టెంబరు 28: మండలంలో భక్తరహళ్ళి నరసంహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని దేవదాయ శాఖ ఈఓ నరసింహరాజు కోరారు. ఆసక్తి గల వారు 15 రోజుల లోపు తమ పూర్తి వివరాలతో డిప్యూటీ కమిషనర్, దేవదాయశాఖ కార్యాలయం.కర్నూల్ వారికి దరఖాస్తులు పంపుకోవాలని సూచించారు.

6న క్రికెట్ విజేతలకు బహుమతులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 28: మండలంలో నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పోటీలు శనివారం ముగిసినట్లు పీఈటీ రాజేష్ తెలిపారు. అక్టోబర్ 6న స్వర్గీయ శ్రీరామరెడ్డి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజు క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు ఉలవల పంపిణీ


ఉలవలు పంపిణీ చేస్తున్న అధికారులు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 28: అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో శనివారం రైతు సేవా కేంద్రంలో ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్ చేతుల మీదుగా రైతులకు ఉలవులు పంపిణీ చేశారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ రైతులు పొలాలను దుక్కి చేసుకొని ఉలవలు పంటను సాగు చేసుకొని లబ్ధి పొందాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి మంజునాథ్, మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, పంచాయతీ అధ్యక్షులు తిప్పజ్జ, కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఓంకార్‌స్వామి, రామచంద్రప్ప, ప్రధాన కార్యదర్శి జయరామప్ప, మారుతీప్రసాద్, దాదాపీర్, జిల్లా వాల్మీకి సాధికార కన్వీనర్ మంజునాథ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, గురుసిద్దప్ప, హార్టికల్చర్ సహాయకులు తేజ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: వ్యసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీతో అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోజం చేసుకోవాలని మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ కోరారు. శనివారం మండలంలోని మెళవాయి పంచాయతీ కార్యాలయంలో రైతులకు సబ్సిడీ ఉలవలను పంపిణీచేశారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేయని రైతులు ఉలవలను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 28: పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మణాలు త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శివశంకరప్ప, ఏఈ శ్రీనాథ్ లబ్ధిదారులకు సూచించారు. మన ఇల్లు మనగౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ వద్దనున్న లేఅవుట్లలో అడదాకులపల్లి గ్రామంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరిత గతిన పూర్తి చేస్తే సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు.మాజీ సర్పంచ్ ఈశ్వరప్రసాద్, రంగనాయకులు, హౌసింగ్ సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని ప్రభుత్వ లేఅవుట్లులో మంజూరైన ఇళ్లు పూర్తికాని వారు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, హౌసింగ్ ఏఈ గణేశ్ సూచించారు. వెలుగు కార్యాలయంలో లబ్ధిదారులు మన ఇళ్లు మన గౌరవం పేరుతో శనివారం అవగాహన కల్పించారు. ఏపీఓ వరప్రసాద్, ఏఓ మునిక్రిష్ణ, హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సంతోష్, బాలక్రిష్ణ, సుబ్బారెడ్డి, లబ్ధిదారులున్నారు.

హిందూపురం(పరిగి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 2021-22, 2024-25 జగనన్న కాలనీ పేరుతో మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సునీత అన్నారు. శనివారం కొడిగెనహళ్లి సచివాలయంలో ఏఈ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో మంజూరైన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోనివారు, బిల్లులు అందని ఇంటి యజమానులు 2025 మార్చి31లోపు పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణం పూర్తికాకపోతే జగనన్న పథకం రద్దు అవుతుందని, బిల్లులు రావని స్పష్టం చేశారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్‌రావు, టీడీపీ కన్వీనర్ గోవిందరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అశ్వర్థప్ప పాల్గొన్నారు.


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్


ఆలయం వద్ద పసుపునీళ్లు చల్లుతున్న టీడీపీ నాయకులు

వెంకన్నను మోసం చేస్తే క్షమించడు

● పసుపు నీళ్లు చల్లిన టీడీపీ నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 28: కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీ నాయకులు దానిని కప్పి పుచ్చుకునేందుకే ఆలయాల్లో పూజలు చేశారంటూ టీడీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం ఉదయం వైసీపీ నాయకులు హిందూపురంలోని పేట వెంకటరమణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం టీడీపీ నాయకులు పేట వెంకటరమణస్వామి ఆలయానికి చేరుకుని పసుపునీళ్ల చల్లి శుభ్రం చేసి అనంతరం స్వామివారికి పూజలు చేయించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసిన జగన్మోహన్‌రెడ్డి దానిని కప్పిపుచ్చుకునేందుకు ఆలయాల్లో పూజలు చేస్తున్నారన్నారు. కానీ దేవుడు ఆయనను క్షమించడన్నారు. వైసీపీ హయాంలో హిందూ ఆలయాలను అపవిత్రం చేశారంటూ ఆరోపించారు. తిరుమలకు వెళ్తే డిక్లరేషన్ ఇవ్వాలని తప్పించుకునేందుకే పర్యటన రద్దు చేసుకున్నారన్నారు. కానీ ప్రభుత్వం అడ్డుకుందని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పు ఒప్పుకుని వేంకటేశ్వరస్వామిని వేడుకోవాలన్నారు. లేదంటే వైసీపీ నాయకులకు పుట్టగతులుండవన్నారు. టీడీపీ నాయకులు నెట్టప్ప, రాఘవేంద్ర, ప్రెస్‌వెంకటేష్, హెచ్ఎన్ రాము, అమర్నాథ్, కార్తీక్, రవీంద్రనాయుడు, మోదాశివ, తిమ్మయ్య వెంకటరమణప్ప, జనసేన నాయకులు నిమ్మకాయల రాము, పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి



ర్యాలీలో లోక కల్యాణ్ ప్రజా సాక్షి సమితి కమిటీ సభ్యులు, విద్యార్థులు

మడకశిరటౌన్, సెప్టెంబరు 28: పట్టణంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల విగ్రహాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని లోక కల్యాణ్ ప్రజాసాక్షి సమితి అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి మసియన్న కోరారు. శనివారం సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని స్వాతంత్ర్య సమరయోధులైన మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్ర బోస్, బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్‌ఆజాద్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో

రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 28: స్థానిక స్నేహలతనగర్‌లో కూటమి నాయకులు శనివారం రూ.22లక్షలతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. నాయకులు సిద్దలింగప్ప మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో కక్షపూరిత రాజకీయానికే పరిమితమైందన్నారు. ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల సంక్షేమంపై దృష్టిసారించిందన్నారు. చేనేత జౌళిశాఖ మంత్రి సవిత నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారన్నారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఎన్ఆర్ఈజీఎస్ కింద రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.22లక్షల నిధులను విడుదల చేయించారన్నారు. టీడీపీ కన్వీనర్ సూరి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, శరత్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ


కమిషనర్ సంఘం శ్రీనివాసులు

హిందూపురం, సెప్టెంబరు 28: హిందూపురం మునిసిపల్ కమిషనర్‌గా సంఘం శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కాకినాడకు బదిలీచేయగా సంఘం శ్రీనివాస్ హిందూపురం కమిషనర్‌గా నియమితులయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ మునిసిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. కమిషనర్‌కు టీడీపీ కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

కత్తితో వీరంగం

గోరంట్ల, సెప్టెంబరు 28: పట్టణంలోని పులేరు రోడ్డులో నివాసముంటున్న మారెప్పఅనే వ్యక్తి కత్తి చేతపట్టుకుని శనివారం రాత్రి వీధి ప్రజలను బెదిరిస్తూ వీరంగం సృష్టించారు. కొత్తచెరువుకుచెందిన మారెప్ప, అతని బార్య గోరంట్లకు వచ్చ పులేరు రోడ్డులో అద్దె ఇంటిలో నివాసముంటూ తాపీ మేస్త్రీగా జీవనం సాగించేవారు. శనివారంసాయంత్రం మారెప్ప కత్తి చేతపట్టుకుని వీధి ప్రజలను బెదిరిస్తూండడంతో ఆందోళన చెందిన స్థానికులు 100కు ఫోన్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని అతని అదులోకి తీసుకోవడానికి శ్రమించాల్సి వ చ్చింది. అయినా మారెప్ప చేతిలోని కత్తిని వదలకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చినతరువాతకూడా చాల సేపువరకు కత్తితో అక్కడున్నవారిని భయాందోళనకు గురి చేశారు. పోలీసులు నచ్చచెప్పి, కత్తిని తీసుకుని, అతని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పాముకాటుతో చిన్నారికి అస్వస్థత

గోరంట్ల, సెప్టెంబరు 28: మండలంలోని బి. కొత్తపల్లికి చెందిన నందిని అనే మూడేళ్ల చిన్నారికి శనివారం పాము కాటువేయడంతో అస్వస్థతకు గురైంది. లోకేష్‌నాయక్ కుమార్తె నందిని తల్లిదండ్రులతో కలిసి వేరుశనగ పొలంలో ఉండగా, చిన్నారి కుడిచేయి వేలిపై పాము కాటు వేసింది. వెంటనే తల్లిదండ్రులు గుర్తించి పామును చంపి, గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108లో పుట్టపర్తికి తరలించారు.

ద్విచక్రవాహనం బోల్తా... ఒకరికి గాయాలు

గోరంట్ల, సెప్టెంబరు 28: మండలంలోని వానవోలు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో మహేష్‌నాయక్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపల్లి తండాకు చెందిన మహేష్‌నాయక్ ద్విచక్ర వాహనంపై శనివారం వానవోలు గ్రామానికెళ్లి పనిముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు గమనించి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

జూద కేంద్రాలపై పోలీసుల దాడులు

పావగడ, సెప్టెంబరు 28: గుమ్మఘట్ట ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తుమకూరు జిల్లా ఎస్పీ కేవీ అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మెరుపు దాడులు నిర్వహించారు. దాడుల్లో ప్రత్యేక స్క్వాడ్ 32 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,18,000, 18ద్విచక్ర వాహనాలు స్వాధీనం పరుచుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వర్షాభావంతో అలమటిస్తున్న పావగడ లాంటి వెనుకబడిన ప్రాంతంలో జూద కేంద్రాలను నడపడం దారుణమని ప్రజాప్రతినిధులు, అధికారులు వీటిపై చొరవ చూపకపోవడమే కారణమని ఎస్పీ తెలిపారు. అరెస్టుచేసిన వారిని శనివారం సాయంత్రం జైలుకు తరలించినట్లు తెలిపారు.